సాక్షి
యాదాద్రి భువనగిరి

శుక్రవారం ౹ 3 ౹ మార్చి ౹ 2023



హక్కులను కాపాడుకుందాం

హక్కుల పరిరక్షణకు జరిగే పోరాటంలో ప్రజాస్వామ్యవాదులు పాల్గొనాలని బృందాకారత్ పిలుపునిచ్చారు.

- 10లో



మా భార్య ఆశీస్సులతో..

జిబ్లక్‌పల్లికి చెందిన నర్సింహ తన చెరుకు రసం బండిపై 'మా భార్య ఆశీస్సులతో..' అని రాసుకున్నాడు.

- 10లో

గరిష్టం/కనిష్టం
36°/17°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతులు అర్హులన్నారు. నెల కాలపరిమితి కలిగిన ఈ కోర్సుకు ఫీజు రూ.1000 చెల్లించాలని, హాస్టల్ వసతి కూడా కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన యువతులు తమ విద్యార్హతల ఒర్జినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, రెండు పాసు ఫొటోలు, ఆధార్‌కార్డుతో ఈ నెల 13న సంస్థలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు నేరుగా హాజరు కావాలని కోరారు.మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్లు 9133908000, 9133908111, 9948466111ను సంప్రదించాలన్నారు.

భువనగిరిలో మున్సిపల్ మడిగెలకు వేలం



వేలం నిర్వహిస్తున్న ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి

భువనగిరిటౌన్ : పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ 29 మడిగెలకు గురువారం వేలం పాట నిర్వహించారు. పాత బస్టాండ్ గల వాణిజ్య, కూరగాయ దుకాణాలు 19, ఆబాది మీట్ మార్కెట్ 9, గంజ్ మీట్ మార్కెట్ ఒక షాప్‌కు వేలం వేశారు. వీటికి ప్రతి నెలా అద్దె రూపేణా రూ.76,570 ఆదాయం సమకూరనున్నట్లు ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. డిపాజిట్ ద్వారా రూ.4,42,000 ఆదాయం వచ్చిందన్నారు. దుకాణాలను దక్కించుకున్న వ్యాపారస్తులు మున్సిపల్ కార్యాలయ సూచన మేరకు ప్రారంభించుకోవాలని పేర్కొన్నారు.

రసాయన ట్యాంకర్ పట్టివేత

చౌటుప్పల్ : మండల పరిధిలోని కొయ్యలగూడెంలో గల ఎస్‌వీల్యాబ్ వద్ద స్థానికులు గురువారం రసాయన ట్యాంకర్‌ను పట్టుకున్నారు. పరిశ్రమ నుంచి ప్రమాదకరమైన వ్యర్థ రసాయనాలను తరలిస్తుందన్న అనుమానంతో స్థానికులు ట్యాంకర్‌ను అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ట్యాంకర్‌ను స్టేషన్‌కు తరలించారు. ట్యాంకర్‌లో ఉన్నది రసాయనాలా లేక వ్యర్థ రసాయనాలా అనే విషయాన్ని గుర్తించేందుకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు సమాచారం ఇచ్చినట్లు సీఐ ఎరమాద మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.

రెడ్లరేపాక వాసికి డాక్టరేట్



కందుల యశోద

వలిగొండ : మండలంలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన కందుల యశోదకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా ప్రదానం చేసింది. సమకాలీన్ హిందీ దళిత్ రాజనైతిక్ మరియు సామాజిక చేతన్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను డాక్టరేట్ దక్కింది. యశోదను బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

మానవత్వం చాటుకున్న ఆత్మకూరు(ఎం) ఎస్‌ఐ



క్షతగాత్రున్ని వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్‌ఐ

ఆత్మకూరు (ఎం) : ప్రమాదవశాత్తు గాయపడ్డ వ్యక్తిని ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు.. ఆత్మకూరు (ఎం) ఎస్‌ఐ గర్దకోట మధు. ఈ సంఘటన ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన ముత్యాలు ద్విచక్రవాహనంపై మోత్కూరులో బంధువుల వివాహానికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఆత్మకూర్(ఎం)లోని జేపీసీ ఫంక్షన్ హాల్ వద్ద ముత్యాలు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అక్కడి నుంచి వెళ్తున్న ఎస్‌ఐ మధు గమనించి తన వాహనాన్ని ఆపాడు. గాయపడ్డ ముత్యాలును ప్రైవేట్ వాహనం ఏర్పాటు చేసి ఆస్పత్రికి తరలించాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని ఆస్పత్రికి తరలించి ఔదార్యం చాటుకున్న ఎస్‌ఐని పలువురు అభినందించారు.

జనం నెత్తిన 'బండ'!



మోత్కూరులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, నాయకులు

పెరిగిన వంట గ్యాస్ ధర

- సిలిండర్‌పై రూ.50 పెంపు
- జిల్లాలో మూడు లక్షల కనెక్షన్లు
- ప్రజలపై నెలకు రూ.60 లక్షల భారం

సాక్షి, యాదాద్రి : మరోసారి వంట గ్యాస్ ధర వడ్డించేశారు. గృహ (డొమెస్టిక్) సిలిండర్‌పై రూ.50, కమర్షియల్ సిలిండర్‌పై రూ.350.50 పెరిగింది. కేంద్ర నిర్ణయంతో జిల్లాపై ప్రతి నెలా రూ.60 లక్షల వరకు భారం పడనుంది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్‌తో పాటు నిత్యావసరాల ధరలు మోత మోగుతున్న తరుణంలో గ్యాస్ ధర పెంచడం పేద, మధ్య తరగతికి శరాఘాతంలా మారింది.

డొమెస్టిక్ కనెక్షన్లు ఇలా..

జిల్లాలో వివిధ గ్యాస్ కంపెనీలకు చెందిన 20 ఏజెన్సీలు ఉన్నాయి. ఆయా ఏజెన్సీల పరిధిలో 3 లక్షల మంది డొమెస్టిక్ వినియోగదారులు ఉన్నారు. ఇందులో సాధారణ 2,14,550, దీపం 48,950 దీపం, ఉజ్వల 13,000, సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ) కనెక్షన్లు 23,566 వరకు ఉన్నాయి. డొమెస్టిక్ సిలిండర్ రూ.1107.50 ఉండగా పెరిగిన ధరతో రూ.1157.50కి చేరింది. తద్వారా జిల్లా ప్రజలపై ప్రతి నెలా సుమారు రూ.60 లక్షల మేర భారం పడనుంది. అదే విధంగా కమర్షియల్ సిలిండర్ రూ.1,980 నుంచి రూ.2330కి చేరింది.

పేద, మధ్య తరగతిపై భారం

పెరిగిన గ్యాస్ ధరల ప్రభావం పేద, మధ్య తరగతి వర్గాల మీద తీవ్ర ప్రభావం చూపనుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు వివిధ స్కీంలలో గ్యాస్ కనెక్షన్లు తీసుకున్నారు. వీరికి సబ్సిడీ, నాన్ సబ్సిడీ కింద గ్యాస్ సరఫరా చేస్తున్నారు.నెలకు ఒకటి చొప్పున సంవత్సరానికి 12 సిలిండర్లు సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. అయితే సిలిండర్‌పై ఇస్తున్న సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఎత్తివేయడంతో మొత్తం నగదు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. తాజాగా పెరిగిన ధరలతో మరింత భారం పడనుంది. అంతేకాకుండా చాలా కుటుంబాలు గ్యాస్‌ను పొదుపుగా వాడుకునేందుకు హీటర్లు, కట్టెల పొయ్యిపై మొగ్గు చూపుతున్నారు.

తల్చుకుంటేనే భయంగా ఉంది



ఒకప్పుడు గ్యాస్ సిలండర్ ధర రూ.400 ఉండేది. పెంచిన ధరతో రూ.1150కి చేరింది. పెరిగిన ధరతో సిలండర్ కొనుగోలు చేయాలంటేను భయం వేస్తోంది. సామాన్యులు గ్యాస్ పొయ్యిపై వంట చేసుకునే పరిస్థితి లేదు. వెంటనే ధర తగ్గించాలి.

– నిలుగొండ గీత, భువనగిరి

రూ.1,200 గ్యాసుకే పోతాయి



నాకు నెలకు రూ.2000 పింఛన్ వస్తుంది. అందులో రూ.1,200 గ్యాస్ సిలిండర్‌కే పోతే మిగిలేది రూ.800 మాత్రమే. వీటితో ఇల్లు గడిచేది ఎట్ల. గ్యాస్‌తో పాటు పప్పులు, ఉప్పులు, నూనె రేట్లను అడ్డగోలుగా పెంచుతుండ్రు. నాలాంటి పేదరాలికి పూట గడిచేది ఇబ్బందిగానే ఉంటుంది.

– ఆవుల యాదమ్మ, యాదగిరిగుట్ట

రాయితీ పునరుద్ధరించాలి



వంట గ్యాస్ సిలిండర్ పెంచిన ధరతో రూ.1,160కి చేరింది. సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీని ఏనాడో ఎత్తివేసింది.రాయితీ ఇవ్వకుండా ఎడాపెడా ధర పెంచుతుంది. పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి. రాయితీని పునరుద్ధరించాలి. లేకపోతే ఎలక్ట్రికల్ స్టవ్‌లు, కట్టెల పొయ్యిపై వంట తప్పదేమో.

– కార్పోతుల కీర్తి, మోత్కూరు

వైభవంగా శ్రీపుష్పయాగం



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీపుష్పయాగం వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి, అమ్మవారిని పుష్పాలతో కనువిందు చేసేలా అలంకరించారు.

సదరం.. స్లాట్ బుకింగ్‌కు తిప్పలు!

- మీ సేవ కేంద్రాల్లో సర్వర్ బిజీ
- ఉదయం నుంచి సాయంత్రం వరకు లబ్ధిదారుల పడిగాపులు

భువనగిరిటౌన్ : స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి మీ సేవ కేంద్రాలకు వెళ్లిన సదరం లబ్ధిదారులకు తిప్పలు తప్పలేదు. గురువారం సర్వర్ బిజీ రావడంతో స్లాట్ బుకింగ్‌లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంది. దీంతో లబ్ధిదారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సి వచ్చింది.

4 నుంచి సదరం శిబిరాలు

మార్చి నెలకు సంబంధించి ఈనెల 4వ తేదీ నుంచి 16వ తేదీ వరకు విడతల వారీగా ఆస్పత్రుల్లో సదరం క్యాంపులు నిర్వహించనున్నారు. ఇందు కోసం లబ్ధిదారులు స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి ఈనెల 2నుంచి అన్ని మీ సేవ కేంద్రాల్లో వెబ్‌సైట్ అందుబాటులో ఉంచారు. కానీ, వెబ్‌సైట్ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓపెన్ కాలేదు.



భువనగిరిలోని మీ సేవ కేంద్రంలో లబ్ధిదారులు

ఉదయం వచ్చాను



ఈ నెల 26వ తేదీన నా సదరం సర్టిఫికెట్ గడువు ముగుస్తుంది. అధికారులు ప్రకటించిన ప్రకారం స్లాట్ బుకింగ్ చేసుకోవడానికి ఉదయం భువనగిరిలోని మీ సేవ కేంద్రానికి వచ్చాను. కానీ, స్లాట్ బుకింగ్ కాలేదు.

–అరుణ జ్యోతి, భువనగిరి

మోదీని నమ్మితే నట్టేట ముంచుతుండు

- తొమ్మిదేళ్లలో దేశ ప్రజలకు చేసిందేమీ లేదు
- కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి
- గ్యాస్ ధర పెంపుపై యాదగిరిగుట్టలో నిరసన




సిలిండర్‌కు పూజలు చేసి నిరసన తెలుపుతున్న మంత్రి మల్లారెడ్డి, విప్ గొంగిడి సునీత తదితరులు

యాదగిరిగుట్ట : మోదీ సర్కార్ వస్తే అంతా మంచి జరుగుతుందని, ధరలు కంట్రోల్ అవుతాయని నమ్మి ప్రజలు ఓట్లేస్తే.. ఇప్పుడు ఆ ప్రజలనే నట్టేట ముంచుతుండని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి విమర్శించారు.తొమ్మిదేళ్లలో దేశానికి చేసిందేమీ లేదని, ప్ర జలందరినీ మోసం చేశారని దుయ్యబట్టారు. పెంచిన గ్యాస్ ధరను వ్యతిరేకిస్తూ గురువారం యాదగిరిగుట్టలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల కిత్రం రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర బీజేపీ అధికారంలోకి వ చ్చిన తర్వాత రూ.1100కు చేరిందన్నారు.డొమెస్టిక్ సిలిండర్‌పై రూ.50, కమర్షియల్ సిలిండర్‌పై రూ. 300 పెంచి పెనుభారం మోపారన్నారు. మోదీ స ర్కార్‌ను తరిమి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్నర్ మీటింగ్, గల్లీ మీటింగ్, బస్తీ మీటింగ్‌లు అని వస్తున్న బీజేపీ నాయకులను మహిళలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. దేశంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు.

ప్రజలే గుణపాఠం చెబుతారు : విప్ సునీత

మోదీ సర్కారుకు ప్రజలే గుణపాఠం చెబుతారని గొంగిడి సునీత అన్నారు. గ్యాస్ ధర పెంచి పేదోడిపై భారం మోపారని మండిపడ్డారు. పెంచి న ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు సిలిండర్‌కు పూజలు చేసి, కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, ఏఎంసీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు కర్రె వెంకటయ్య, పెలిమెల్లి శ్రీధర్‌గౌడ్, కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణి, ఆవుల మమత, గౌలికార్ అరుణ, కోఆప్షన్ సభ్యులు గౌర్ల పద్మ, ముక్కెర్ల అండాలు, కళ్లెం స్వాతి, పాపట్ల నరహరి, మిట్ట వెంకటయ్య, ముక్కెర్ల సతీష్, శారాజీ రాజేష్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, సుడుగు శ్రీనివాస్‌రెడ్డి, అంకం నర్సింహ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

- ఏ చిన్న సమస్య కూడా రావొద్దు
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి,యాదాద్రి : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఏచిన్న సమస్య కూడా రావొద్దని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సంబంధిత అధికారులతో సమావేశమై పరీక్షల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. మార్చి 15నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని, అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని కోరారు. 31 కేంద్రాల్లో 13,309 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, ఒక ఎగ్జామినేషన్ టీం పరీక్షలను పర్యవేక్షిస్తాయన్నారు. పరీక్ష సమయంలో సెంటర్ల వద్ద 144 సెక్షన్ విధించాలని, జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలని సూచించారు. ఆర్టీసీ బస్సులను సకాలంలో నడపాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పరీక్ష కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడాలన్నారు. మంచి నీరు, టాయిలెట్ల సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, చౌటుప్పల్ ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, ఏసీపీ వెంకట్‌రెడ్డి, డీఐఈఓ రమణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పంచాయతీలుగా తీర్చిదిద్దుదాం

బీబీనగర్ : స్వచ్ఛ గ్రామ పంచాయతీల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. బీబీనగర్ మండలం అన్నంపట్లలో గురువారం నిర్వహించిన స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీలు స్వచ్ఛలో ఆదర్శంగా నిలిచేలా సర్పంచ్‌లు కృషి చేయాని సూచించారు. అన్నంపట్లను ప్లాస్టిక్ రహిత గ్రామ పంచాయతీగా ఉంచేందుకు స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అదే విధంగా సుకన్య సమృద్ధి యోజన పథకంలో భాగంగా 53 మంది చిన్నారులకు ఖాతాలు తీయించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినందుకు గాను గ్రామ పంచాయతీ అధికారులకు ప్రశంసపత్రం అందజేశారు. అంతకుముందు గ్రామ సర్పంచ్ అందజేసిన 20 స్టీల్ ప్లేట్లు, బాటిళ్లు, మగ్గులను గ్రామ సమాఖ్య మండలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుధాకర్‌గౌడ్, జెడ్పీటీసీ ప్రణీతాపింగళ్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీవాణి, రైతు సమితి మండల కోఆర్డినేటర్ జైపాల్‌రెడ్డి, సర్పంచ్ వసుమతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

అంతర్గత మార్కులే కీలకం!

- టెన్త్ విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన
- జిల్లాలో మొదలైన ప్రక్రియ
- 19 ప్రత్యేక బృందాలు ఏర్పాటు

భువనగిరి : పదో తరగతి ఇంటర్నల్ అసెస్‌మెంట్ పరీక్షల మార్కులపై తనిఖీలకు విద్యాశాఖ అధికారులు రంగంలోకి దిగారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల అంతర్గత మార్కుల నమోదును పరిశీలిస్తున్నారు. ఇందు కోసం 19 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఈనెల 2న మొదలైన మార్కుల పరిశీలన ఈనెల 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

పాఠశాలలు, విద్యార్థులు

ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్‌తో పాటు కేజీబీవీ, మోడల్, రెసిడెన్సియల్, గురుకుల, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పాఠశాలలతో పాటు ప్రైవేట్ స్కూళ్లు 268 ఉన్నాయి. ఆయా పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులు 8,546 మంది ఉన్నారు. 2022–23 విద్యా సంవత్సరానికి ఎఫ్ఏ(ఫార్మేటివ్ అసెస్‌మెంట్-1,2,3,4తో పాటు ఎస్ఏ (సమ్మేటీవ్ అసెస్‌మెంట్) 1,2 పరీక్షలు నిర్వహించారు. ఆయా పరీక్షల్లో వచ్చిన మార్కులను జిల్లా విద్యాశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.



బొమ్మలరామారం కేజీబీవీలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

పరిశీలన విధానం ఇలా..

విద్యార్థులకు ఇంటర్నల్ పరీక్షల్లో వచ్చిన మార్కులను పరిశీలించేందుకు ప్రత్యేకంగా 19 బృందాలు ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ప్రధానోపాధ్యాయుడు, లాంగ్వేజ్ పండిట్, నాన్ లాంగ్వేజ్ ఉపాధ్యాయుడు ఉంటారు. పాఠశాలలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాలతో పాటు మార్కుల నమోదు పత్రాలను పరిశీలిస్తున్నారు. అవసరమైతే విద్యార్థులను మౌఖికంగా ప్రశ్నస్తున్నారు. సాధారణంగా పదో తరగతి విద్యార్థులకు ఒక్కో సబ్జెక్టులో 80 మార్కులు ఉండగా మిగిలిన 20 అంతర్గత మార్కులుగా పరిగణలోకి తీసుకుంటారు. అంతర్గత మార్కులను సరిగా వేశారా లేదా అని బృందాలు పరిశీలిస్తున్నాయి. ప్రక్రియ పూర్తి కాగానే మార్కులను ఆన్‌లైన్‌ద్వారా నమోదు చేయనున్నారు.

పారదర్శకంగా పరిశీలన

పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కులను పరిశీలించే ప్రక్రియ ఈనెల 2న ప్రారంభమైంది. ఈ నెల 4వ వరకు ప్రక్రియ కొనసాగనుంది. పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మార్కులను పరిశీలించి సగటు మార్కులను తీసుకోనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శంగా జరిగేలా ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశాం.

–నారాయణరెడ్డి, డీఈఓ

డిమాండ్లు నెరవేర్చాల్సిందే



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

- ప్రభుత్వాలు స్పందించే వరకు పోరాటం
- అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి
- రెండో రోజు కొనసాగిన సమ్మె

భువనగిరిటౌన్ : డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరింది. గురువారం కలెక్టర్ ఎదుట చేపట్టిన ధర్నాలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించడంలో విఫలం అయ్యాయని విమర్శించారు. అంతేకాకుండా అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఐసీడీఎస్‌కు కేంద్ర బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయిస్తున్నారని, ఇవి దేనికీ చాలడం లేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చట్టం అమలు చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం చెల్లించాలని, పెన్షన్, ఈఎస్ఐ వర్తింపజేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి మాట్లాడుతూ కేంద్రం అంగన్‌వాడీ ఉద్యోగులపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుందన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం నేటికీ హామీ అమలు చేయలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్‌కు బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బూరుగు స్వప్న మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రాట్యుటీ చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కల్లూరి మల్లేశం, నాయకులు పాండు, గడ్డం వెంకటేశం, వనం రాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు భాగ్య పాల్గొన్నారు.

నేడు వంటావార్పు

సమ్మెలో 1,600 మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొంటున్నారు. దీంతో రెండు రోజులుగా అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకోవడం లేదు. సమ్మెలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట వంటావార్పు చేపట్టనున్నారు.

సమ్మెశిబిరం వద్దే బస

డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో భాగంగా రాత్రి సమ్మె శిబిరం వద్దనే భోజనం చేసి అక్కడే నిద్రించారు.

సమ్మె శిబిరంలో బస చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు





ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా మైదానం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

భువనగిరి : పట్టణంలోని సమ్మద్ చౌరస్తా నుంచి జంఖానగూడెం వరకు చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, గాంధీనగర్ సమీపంలో పార్కు అభివృద్ధి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న క్రీడా మైదానం పనులను గురువారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పరిశీలించారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, నాణ్యతలో ఏమాత్రం రాజీపడవద్దని అధికారులకు సూచించారు. జూనియర్ కళాశాల మైదానం పనులపై ఆర్కిటెక్‌తో మాట్లాడారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్, బీఆర్ఎస్ పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ గోమారి సుధాకర్‌రెడ్డి, నాయకులు హరికిషన్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మిర్యాలగూడ: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన మాడ్గులపల్లి మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన కోల రాములు(62) బుధవారం రాత్రి తన కిరాణ దుకాణంలో ఫ్రిడ్జ్ డోర్‌తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. దీంతో అక్కడే ఉన్న కోల జానయ్య వెంటనే రాములును మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుమార్తె దొనేటి మణెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

బొమ్మలరామారంలో మరొకరు

బొమ్మలరామారం: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన బొమ్మలరామారం మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైలారం గ్రామానికి చెందిన ఇండ్ల సత్యనారాయణ(55) గ్రామ సమీపంలోని షామీర్‌పేట్ వాగు వైపు వెళ్లాడు. వాగులో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు చేపలు పట్టడానికి విద్యుత్ వైర్లు వేసి ఉంచారు. ఇది గమనించని సత్యనారాయణ కరెంట్ వైర్ తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ వెంకన్న ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి కుమారుడు కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


సత్యనారాయణ (ఫైల్)

రేపు పోలీస్ కార్యాలయంలో పాత సామగ్రి వేలం

నల్లగొండ క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో పాత సామగ్రిని శనివారం (ఈనెల 4వ తేది) ఉదయం 10 గంటలకు వేలం వేస్తున్నట్లు ఎస్పీ అపూర్వరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం వేసేవాటిలో పాత టెంట్లు, ఐటీ విభాగానికి చెందిన కంప్యూటర్లు, ఫర్నిచర్, ఐరన్ రీడింగ్ చైన్లు, కార్పెట్లు, హెల్మెంట్లు, ప్రింటర్లు తదితర వస్తువులు ఉన్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వెల్ఫేర్ ఆఫీసర్ సంతోష్ సెల్ : 8774898080 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

గోదావరి జలాలు తగ్గింపు

అర్వపల్లి: జిల్లాకు వస్తున్న గోదావరి జలాలను గురువారం తగ్గించారు. వారబందీ విధానంలో ఇప్పటి వరకు 1800 క్యూసెక్కుల జలాలు వస్తుండగా వీటిని 1510 క్యూసెక్కులకు తగ్గించారు. ఈనీటిని జిల్లాలోని 69,70,71 డిస్ట్రిబ్యూటరీలకు వదులుతున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

ఏపీ నుంచి ఇసుక రవాణా

- ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి అక్రమ తరలింపు
- చెక్‌పోస్టులు తప్పించుకునేందుకు గ్రామాల మీదుగా వస్తున్న లారీలు
- మామూళ్లు తీసుకుని పోలీసులే సహకరిస్తున్నారని ఆరోపణలు
- ఫిర్యాదులు వస్తే నామమాత్రంగా కేసులు నమోదు


ఇసుక తరలిస్తూ వారం క్రితం పట్టుబడిన లారీ


నంబర్ ప్లేట్ లేని టిప్పర్‌లో హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్న అక్రమార్కులు

కోదాడరూరల్: ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి జోరుగా ఇసుక అక్రమ రవాణా అవుతోంది. రాత్రికి రాత్రే టిప్పర్‌లు, లారీలు ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ సరిహద్దు గ్రామాల మీదుగా కోదాడ, హైదరాబాద్‌కు చేరుకుంటున్నాయి. ఈ విషయం తెలిసిన ఓ పోలీస్ అధికారి టిప్పర్, లారీకి వేర్వేరుగా రేటు మాట్లాడుకొని ఇసుక వ్యాపారుల దందాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఈ దందా ఎక్కువ కావడంతో కొందరి ఫిర్యాదుల మేరకు తూతూమంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు కూడా వచ్చాయి. కోదాడలోని కొందరు వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ, కంచికచర్లలో కొందరు వ్యాపారులతో చేతులు కలిపి ఈ దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ఇసుకను రవాణా చేస్తున్న వాహనాల్లో కొన్నింటికి నంబర్ ప్లేట్లు కూడా లేకపోవడం గమనార్హం.

సరిహద్దు గ్రామాల మీదుగా..

ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ, కంచికచర్ల ప్రాంతాల్లోని వాగుల నుంచి ఈ ఇసుక వ్యాపారం సాగుతుంది. అక్కడి ప్రభుత్వం డీడీలు తీస్తే ఇసుక రీచ్‌లను బట్టి రూ.450 నుంచి రూ.800 వరకు విక్రయిస్తుంది. అయితే అక్కడి ప్రధాన వాగుల్లో ప్రస్తుతం నీటి ప్రవాహం లేకపోవడంతో కొందరు వ్యాపారులు రీచ్‌ల నుంచి కాకుండా వేరే చోట్ల నుంచి రాత్రి సమయాల్లో జేసీబీలతో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి టిప్పర్‌లు, లారీల ద్వారా ఇసుకను తెలంగాణలోకి రవాణా చేస్తున్నారు. అయితే ఈ వాహనాలు తెలంగాణలోని కోదాడకు రావాలంటే విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై రెండు రాష్ట్రాల సరిహదుల్లో ఉన్న అటు చిల్లకల్లు, ఇటు చిమిర్యాల చెక్‌పోస్టులను దాటి రావాల్సి ఉంది. ఈ మార్గంలో వస్తే చెక్‌పోస్ట్ సిబ్బంది పట్టుకుంటారనే భయంతో ఆ వాహనాలను ఏపీలోని జగ్గయ్యపేట మీదుగా దొండపాడు, అన్నారం, రెడ్లకుంట, కాపుగల్లు, గుడిబండ గ్రామాల మీదగా కోదాడకు తరలిస్తున్నారు. ఇలా వచ్చిన ఇసుకను తెల్లవారుజామునే వేబ్రిడ్జి కాంటాపెట్టి కొందరు కోదాడతో పాటు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తుండగా మరికొందరు హైదరాబాద్ తరలిస్తున్నారు.

భారీగా వసూళ్లు

ఈ అక్రమ ఇసుక దందాకు సహకరించేందుకు ఓ పోలీస్ అధికారి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే కొందరి వద్ద నెల నెలా మామూళ్ల లెక్కన మాట్లాడుకోగా, మరికొందరి వద్ద లారీ, టిప్పర్‌కి వేర్వేరుగా రేటు మాట్లాడుకుని ఇసుకను తరలించేందుకు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది.

తక్కువ రేటుకు విక్రయిస్తూ..

ఇలా అక్రమంగా తక్కువ రేటుకు తీసుకొచ్చిన ఇసుకను ఆ వ్యాపారులు టన్ను రూ.900 నుంచి రూ.1000 వరకు విక్రయిస్తున్నారు. అయితే అన్ని అనుమతులు తీసుకొని డీడీలు చెల్లించి ఇసుక వ్యాపారం చేస్తున్న మరికొందరు ఈ ధరకు అమ్మితే తమకు గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఇసుక వ్యాపారులు కోరుతున్నారు.

కేసులు నమోదు చేస్తున్నాం



ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోకి అక్రమంగా వస్తున్న ఇసుక లారీలు, టిప్పర్‌లపై ఇప్పటికే కేసులు నమోదు చేశాం. ఇసుక అక్రమంగా రవాణా చేసే వారిపై ఫిర్యాదు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణాలో పోలీసుల సహకారం ఉందనే ఆరోపణలు అవాస్తవం.

– వెంకటేశ్వర్‌రెడ్డి, డీఎస్పీ, కోదాడ

వైభవంగా చక్రతీర్థం.. దోపోత్సవం


ఆలయంలో దేవతోద్వాసన పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు

- కొనసాగుతున్న యాదాద్రి బ్రహ్మోత్సవాలు
- మహాపూర్ణాహుతి, దేవతోద్వాసన, పుష్పయాగం నిర్వహించిన ఆచార్యులు
- నేడు శతఘటాభిషేకం, శృంగార దోలోత్సవంతో ఉత్సవాల ముగింపు


స్వామి వారికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం ప్రధానాలయంలో ఆచార్యులు నిత్యారాధనలు, ప్రభాతబేరీ, విష్ణుసహస్ర నామ పారాయణాలు జరిపించారు. అనంతరం ఉదయం 10.30గంటలకు మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని చేపట్టారు. 11.30గంటలకు మహావిష్ణువు ఆయుధమైన శ్రీచక్ర ఆళ్వారుడికి, ఉత్సవమూర్తులకు విశేష పూజలు చేసి కొండపై గల విష్ణు పుష్కరిణిలో చక్రతీర్థం చేపట్టారు. అంతకుముందు ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులు, శ్రీచక్ర ఆళ్వారుడిని ప్రత్యేక పల్లకిపై అధిష్ఠింపజేసి పూజలు చేసి సుదర్శ నారసింహ అలంకారంలో ఆలయ మాఢ వీధుల్లో ఊరేగిస్తూ విష్ణు పుష్కరిణి వద్దకు తీసుకొచ్చి శుద్ధమైన జలంలో స్నానం చేయించారు. అనంతరం ఆలయ ఆచార్యులు, అధికారులు పుష్కరిణిలో స్నానం ఆచరించారు. విష్ణు పుష్కరిణిలో పూజించిన శుద్ధ చక్రతీర్థ జలాన్ని ప్రచార రథంలో ఊరేగింపుగా తీసుకెళ్లి కొండ కింద లక్ష్మీ పుష్కరిణిలో కలిపారు. అనంతరం భక్తులు పెద్దఎత్తున అందులో పుణ్య స్నానాలు ఆచరించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సాయంత్రం నిత్యారాధనల అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం ఆచార్యులు దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, దోపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, యాజ్ఞీకులు, రుత్వికులు, ఆచార్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో నేడు

బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం ఉదయం 10గంటలకు అష్టోత్తర శతఘటాభిషేకం జరిపించనున్నారు. రాత్రి 9గంటలకు శృంగార దోలోత్సవం నిర్వహించి ఉత్సవాలను పరిసమాప్తం చేయనున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం యాదగిరిగుట్టకు చెందిన శ్రీవైష్ణవ సేవా సమాఖ్య వారిచే ప్రభాత భేరీ, భూదాన్‌పోచంపల్లికి చెందిన శ్రీలక్ష్మీనారాయణ భజన మండలి, యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన శ్రీభాగ్యలక్ష్మీ భక్త భజన మండలిచే భజన నిర్వహించారు. అనంతరం ఆస్థాన మంగళవాయిద్యం, ఆస్థాన వైదిక ప్రార్థనలు, నృసింహతత్వంపై కేవీ నరసింహాచార్యులు ఉపన్యాసం గావించారు. విరాట పర్వం హరికథను ముదపాక బాలసుందరం, భాగవతార్ గానం చేశారు. సాయంత్రం సుస్వర ఆకాడమీచే భక్తీ సంగీతం, బృందావని బృందం, సాంస్కృతిక కళామండలి బృందం, కూమారి లహరి బృందం, హరిత బృందం, కుమారి నాగదుర్గ బృందంలచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. రాత్రి నూక జగదీశ్వరిచే ప్రధానాలయంలో భక్తి సంగీతం, శ్రీలక్ష్మీనారాయణ భాగవతార్‌చే దోపు కథను నిర్వహించారు.


నృత్యం చేస్తున్న కళాకారిణి


యాగశాలలో మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న ఆచార్యులు


కొండ కింద లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

విద్యార్థులు సృజనాత్మకతను అలవర్చుకోవాలి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత


ఎగ్జిబిట్‌లను తిలకిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట: విద్యార్థులు చిన్నప్పటి నుంచే సృజనాత్మకతను అలవర్చుకోవాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. జాతీయ విద్యా వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకొని యాదగిరిగుట్ట పట్టణంలోని శ్రీగౌతమ్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె సందర్శించి మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులు సుమారు 250 వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సమ్మక్క, సారలమ్మ గద్దెలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, కౌన్సిలర్ గుండ్లపల్లి వాణి భరత్‌గౌడ్, పాఠశాల వ్యవస్థాపకుడు మిర్యాల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మకు ప్రత్యేక పూజలు..

పట్టణంలోని 12వ వార్డు పాతగుట్టలో జరుగుతున్న పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట కౌన్సిలర్ దండబోయిన అనిల్, గుండ్లపల్లి వాణి, గౌళికార్ అరుణ తదితరులున్నారు.

యాకేష్‌పై పీడీ యాక్టు నమోదు

- చర్లపల్లి జైలుకు తరలింపు

భువనగిరి: మండలంలోని బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన మేడబోయిన యాకేష్‌పై పీడీ యాక్టు నమోదు చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ గురువారం తెలిపారు. వివరాలు.. విద్యార్థినులపై వేధింపులు, ఈవ్‌టీజింగ్ లాంటి ఆరోపణలతో 2015లో భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో మేడబోయిన యాకేష్‌పై కేసు నమోదైంది. అతని ప్రవర్తనలో మార్పు రాకపోగా.. తిరిగి అమ్మాయిలను వేధింపులకు గురి చేయడంతో 2018లో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. 2023 జనవరి 7న భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన 14 సంవత్సరాల బాలికను ఇంట్లో నిర్బంధించి లైంగిక వేధింపుల ఆరోపణలో కేసు నమోదు చేసి జ్యూడీషియల్ కస్టడీలోకి తీసుకున్నారు. యాకేష్ ప్రవర్తన, కార్యకలాపాలు ప్రజలకు హాని కలిగించే విధంగా ఉండటంతో పీడీ యాక్టు నమోదు చేసి గురువారం చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.


యాకేష్‌ను చర్లపల్లి జైలుకు తరలిస్తున్న పోలీసులు

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

కట్టంగూర్: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పరడ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పరడ గ్రామానికి చెందిన స్వాతి(27)కి అదే గ్రామానికి చెందిన పరడ మహేష్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక పాప సంతానం. భర్తతో మనస్పర్థల కారణంగా స్వాతి కొంతకాలంగా గ్రామంలోని తన తల్లిగారి ఇంట్లో ఉంటుంది. మూడు నెలల క్రితం పెద్దమనుషుల సమక్షంలో విడాకులు తీసుకునేందుకు ఇరు కుటుంబాలు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన స్వాతి గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇనుప పైపుకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

వేర్వేరు చోట్ల నలుగురు అదృశ్యం


రమాదేవి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల పరిధిలోని అల్వాల గ్రామానికి చెందిన కంచర్ల రమాదేవి అదృశ్యమైనట్లు గురువారం ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ బాబు పేర్కొన్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రమాదేవి ఫిబ్రవరి 28న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం రమాదేవి తల్లి సైదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రామన్నపేటలో వ్యక్తి..


శంకర్

రామన్నపేట: మండల కేంద్రంలోని వడ్డెరవాడకు చెందిన గజరాజు శంకర్(52) రెండు రోజుల క్రితం అదృశ్యమైనట్లు స్థానిక ఎస్‌ఐ ఎం. లక్ష్మయ్య గురువారం తెలిపా రు. శంకర్ మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని, ఎంత వెతికినా శంకర్ ఆచూకీ లభించకపోవడంతో అతడి కుమారుడు సాయి బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శంకర్ ఆచూకీ తెలిసిన వారు 9490617537 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

భువనగిరిలో ఒకరు..


వెంకటేష్

భువనగిరి : మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరవెల్లి గ్రామానికి చెందిన నల్లమాస వెంకటేష్ భార్యతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 28న మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బైక్‌పై ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం అతని తండ్రి మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

మఠంపల్లిలో మహిళ..


పూలమ్మ

మఠంపల్లి: మండల కేంద్రానికి చెందిన కుంభం పూలమ్మ(54) ఫిబ్రవరి 28వ తేదీ నుంచి కనిపించకుండాపోయిందని ఆమె భర్త కుంభం లింగయ్య గురువారం మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పూలమ్మ మానసికస్థితి సరిగాలేదని, ఆమె ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపారు.

గొల్లకురుమ లబ్ధిదారులకు షాక్!

- పక్కదారి పడుతున్న గొర్రెల పంపిణీ పథకం
- ప్రస్తుతం ఇస్తున్నవి 15గొర్రెలు.. 5 పిల్లలు.. ఒక పొట్టేలు
- అమ్మకందారుడికి రూ.1.20లక్షలు మాత్రమే ఇచ్చేలా ఒప్పందం
- యూనిట్ల అందజేతలో మధ్యవర్తులదే హవా

మునుగోడు మండలానికి చెందిన ఓ గొల్లకురుమ లబ్ధిదారుడికి గొర్రెల యూనిట్ మంజూరైంది. అతడు అనధికార మధ్యవర్తుల ద్వారా అనంతపురం జిల్లాలో గొర్రెలను కొనుగోలు చేశాడు. అయితే, అతడికి సదరు రైతు మాత్రం లబ్ధిదారుడికి పదిహేను గొర్రెలు.. ఐదు పిల్లలు.. ఒక పొట్టేలు మాత్రమే ఇచ్చాడు. ఇదేమిటని అమ్మకందారుడిని అడిగితే నాకు ఇచ్చేది రూ.1.20లక్షలు మాత్రమేనని, మిగిలిన రూ.38వేలు తిరిగి మధ్యవర్తులకు ఇవ్వాలి. అందుకే ఆ డబ్బులకు సరిపడా 5పిల్లలు ఇస్తున్నామని చెప్పడంతో ఆ లబ్ధిదారుడు షాక్ తిన్నాడు.

మునుగోడు: రాష్ట్ర ప్రభుత్వం గొల్లకురుమల ఆర్థిక అభివృద్ధికి అందిస్తున్న గొర్రెల పంపిణీ పథకం పక్కదారి పడుతోంది. నిబంధనల ప్రకారం ఒక్కో యూనిట్‌కు 20గొర్రెలు, ఒక పొట్టేలును అందించాల్సి ఉన్నా మాంసం ధరలు పెరిగాయంటూ యూనిట్‌లో ఐదు గొర్రెలు తగ్గించి వాటి స్థానంలో పిల్లలను అంటగడుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఏడు మండలాలకు 7,400 యూనిట్లు

మునుగోడు నియోజకవర్గంలోని ఏడు మండలాలకు 7,400 యూనిట్లు మంజూరయ్యాయి. అయితే, ప్రభుత్వం ఇటీవల మునుగోడు, చండూరు మండలాల్లోని లబ్ధిదారులకు యూనిట్లను మంజూరు చేస్తోంది. కాగా, మునుగోడు, చండూరులో లబ్ధిదారులకు పంపిణీ చేసిన 193 యూనిట్లను ఇదే తరహాలో అంటగట్టినట్లు తెలిసింది.


ఇటీవల అనంతపురం జిల్లాలో ఓ లబ్ధిదారుడు కొనుగోలు చేసి తీసుకొచ్చిన గొర్రెలు

మధ్యవర్తులను ఆశ్రయించొద్దు

గొర్రెల కొనుగోలు విషయంలో లబ్ధిదారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. గొర్రెలు అమ్మే రైతుల వద్దకు వెళ్లి లబ్ధిదారులు నచ్చినవి కొనుగోలు చేస్తే అప్పుడు మా వైద్యులు అవి ఆరోగ్యంగా ఉన్నాయ లేదా పరిశీలించి ట్యాగ్ వేసి పంపిస్తున్నారు. మాంసం ధరలు పెరిగిన కారణంగా గొర్రెల అమ్మకందారులు ధరలు పెంచి అమ్ముతునట్లు తెలిసింది. రైతులకు నచ్చకపోతే మరో చోట కొనుగోలు చేయాలి. కానీ మధ్యవర్తులను ఆశ్రయించొద్దు.

– డాక్టర్.యాదగిరి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, నల్లగొండ

మధ్యవర్తులతో..

అనధికార మధ్యవర్తులు లబ్ధిదారులను గొర్రెల అమ్మకందారుడి వద్దకు తీసుకెళ్లి బేరం ఆడిస్తున్నారు. ఆ యూనిట్‌కు ఎన్ని డబ్బులు ఇవ్వాలి అనే నిర్ణయం అంతా అక్కడే ఉన్న ఆ మధ్యవర్తులదే అని విశ్వసనీయంగా తెలిసింది. గతంలో జిల్లా చుట్టూపక్కల గల మాచర్ల, గుంటూరు జిల్లాల్లో గొర్రెలను కొనుగోలు చేసేవారు. అయితే వాటిని లారీలో తీసుకొచ్చి ఆ వెంటనే మరుసటి రోజు లేదా నాలుగు, ఐదు రోజుల తర్వాత ఆ అమ్మిన వ్యాపారి ఆ గొర్రెలను మళ్లీ కొనుగోలు చేసి తీసుకెళ్లేది. అయితే, ఇప్పుడు దాదాపు 500 కిలోమీటర్లకుపైగా దూరం ఉన్న అనంతపురం జిల్లాలో కొనుగోలు చేస్తుండడంతో తిరిగి అక్కడికి తీసుకెళ్లేందుకు రవాణా చార్జీలు అధికమవుతున్నాయని, అలా కాకుండా అమ్మే సమయంలో తమ కమీషన్ అధికంగా పొందేందుకు వ్యాపారులు 20గొర్రెలకు బదులుగా అందులో 15గొర్రెలు, 5పిల్లలను పెట్టి లబ్ధిదారులుకు ఇప్పిస్తున్నట్లు బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలా అమ్మిన రైతుకు ఒక్కో గొర్రెకు రూ.7వేల చొప్పున రూ.1.5లక్షలు, పొట్టేలుకు రూ.10వేలు, 5పిల్లలకు ఒక్కోదానికి రూ.2వేల చొప్పున రూ.10వేలతో కలిపి మొత్తం రూ.1.20లక్షల నుంచి రూ.1.25లక్షలు మాత్రమే ఇచ్చేలా అనధికార మధ్యవర్తులు ఒప్పందం కుదుర్చుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొనుగోలు చేసిన లబ్ధిదారుడు తన బ్యాంక్ ఖాతా ద్వారా అమ్మిన రైతుకు ట్రాన్స్‌ఫర్ ఓచర్‌పై రూ.1.58లక్షలకు సంతకాలు పెట్టించి ఇస్తున్నారు. ఆ డబ్బులు అమ్మిన రైతు బ్యాంక్ ఖాతాలో జమైన తరువాత ఒప్పందం ప్రకారం రూ.1.20లక్షలు తీసుకుని మిగిలిన రూ.30వేల నుంచి రూ.35వేలు ఆ వ్యాపారికి ఇస్తున్నట్లు సమాచారం. అందులో రూ.20వేలకు పైగా సంబంధిత శాఖ నిర్వాహకులకు అప్పగించేలా ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో తమకు పథకం కింద పూర్తి ప్రయోజనం చేకూరడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.